# వారసత్వం

పిల్లలు అలవాట్లకు బానిసలెందుకవుతున్నారు?

పెద్దలు బిడ్డల్ని మందలించే అపురూపమైన అధికారాన్ని కోల్పోయినందువల్ల.

—జయప్రద

"ఏమైంది జయా?" జుట్టంతా రేగిపోయి, కళ్ళు ఉబ్బిపోయి, మాసిపోయిన చీరతో వచ్చిన జయంతిని చూసి కాల్ అటెండ్ అవబోతున్న నేను కార్డ్‌ని చేతిలో అలాగే పట్టుకుని అడిగాను.

జయ మాట్లాడలేదు.

నా ప్రక్కనే వున్న బల్లమీద కూలబడిపోయి భోరున ఏడ్చేసింది.

ఆమెకు ఓర్చుకునే పాయింట్ దాటిపోయినట్లుంది.

లేకపోతే సభ్యత మర్చిపోయి తన కంట్రోలింగ్ పవర్‌ని అధిగ మించి ఆ ఎక్స్ఛేంజ్ డిపార్టుమెంట్‌లో అలా అసహ్యంగా పెట్టుకో నుండేది కాదు నా స్నేహితురాలు.

"ఒన్ మినిట్" మధ్యలో ఆగిపోయిన కాల్ కనెక్షన్ ఇవ్వను సిద్ధమయ్యాను.

"హలో!"

"టూ ఫోర్ టూ ఫోర్ జీరోనా? కనెక్షన్ ఇచ్చి హెడ్‌సెట్‌ను ప్రక్కన పెట్టేసి పూర్తిగా జయవైపు తిరిగాను.

అప్పటికి కాస్త తేరుకుంది జయంతి.

"ఏమయింది జయా? మామూలేనా?"

మామూలేనన్నట్లు తలూపిందామె.

జయ భర్త తాగుబోతు. ఎండలు విపరీతంగా కాసే దక్షిణ భారతదేశంలో కూడా తాగుబోతులకు కొదవలేదుగానీ అందరు తాగు బోతులు ఇలా భార్యలను హింసించరు.

నిషాకు లోబడి త్రాగినా, తన తప్పు తెలుసుకుని భార్య ముందు దోషులుగా నిలబడే మంచివ్యక్తులున్నారు. తాగుడు, ఓ తప్పుగా అనుకో కుండా అదో ప్రిస్టేజ్ పాయింట్‌గా భావించి, భార్య ఎదుటపడి ఆమె మనసు బాధపెట్టడమెందుకులే అనే యోగ్యులూ వున్నారు.

తన సుఖం తన సరదా మాత్రమే చూసుకుని భార్య ఎంత బాధపడ్డా, ఎంత మొత్తుకున్నా తమను కాదన్నట్టుగా ప్రవర్తించే స్వార్థ పరులూ ఉన్నారు.

మా జయ భర్త వాళ్ళల్లో ఏ ఒక్కడైనా నేను కొంత సంతోష పడుందును కానీ, అతను తాగుబోతే కాదు, శాడిస్ట్‌కూడా. తాగి తన అయోగ్యతను దాచుకోను భార్యను అయోగ్యురాలిగా చిత్రించి, హింసించి

తన యోగ్యతను నిరూపించుకోవాలని తాపత్రయపడే అతని పేరు నారాయణరావు. అతనెలాటి వాడన్నాకానీ, అతను జయకు సర్వస్వం. ఇదీ మా దేశ చరిత్ర.

జయ ఏదో చెపుతోంది. నేను వింటున్నాను. అతన్ని మనసులోనే అసహ్యించుకుంటున్నాను. బోర్డులో లైట్లు వెలుగుతున్నాయి. నేను తేరుకుని తృళ్ళిపడి హెడ్ సెట్ ని తలకు తగిలించుకున్నాను.

"సారీ జయా! డ్యూటీలో నాకు కుదరదు. మరో గంటకు డ్యూటీ అయిపోతుంది. ఇటునుండే మీ ఇంటికి వస్తాను. ఆ టైమ్‌లో మీ పతి దేవుడుండడుగా"

వుండడన్నట్టు తలూపింది జయ.

ఆ డ్యూటీ పూర్తయ్యి నేను జయంతి వాళ్ళింటికెళ్ళేసరికి పద్నాలుగేళ్ళ కొడుకు అమ్మను ఓదారుస్తున్నాడు. తండ్రి మీద వాడి చిన్నగుండెలో వున్న కసంతా అమ్మమీద జాలి రూపంలో జారి ఆమెను తడిపేస్తోంది.

ఆమెకు స్వాంతన నిస్తోంది.

ఆ దృశ్యాన్ని చూసిన నా గుండెల్లో తడి. ఆ తడి ఎందుకు? ఆ పిల్ల పరిస్థితులమీద జాలా? ఆ పిల్లాడిమీద కరుణా?

ఏమో నాకే తెలియదు. కానీ నా కళ్ళల్లో కూడ తడి.

నన్ను చూసి వాడు సిగ్గుపడి లేచి వెళ్ళిపోయాడు.

కూర్చోమన్నట్టు చూసింది జయ.

ఆమె కళ్ళల్లో చిక్కటి నిరాశక్తత, విరక్తి.

"మీ తోడికోడలేదీ?"

"లోపలుంది."

ఆ తర్వాత చాలా సేపటిదాకా నేను మాట్లాడలేదు. నోరు విప్పితే అతన్ని దూషించాలి. లేదా జయమీద జాలి పడాలి. రెండూ ఆమెకు ఇష్టంలేదని నాకు తెలుసు. నా గాక ,నా ఓదార్పు ఆమెకు ఎలాటి పరిష్కారాన్ని చూడలేవని నాకు తెలుసు, ఎక్స్‌చేంజ్‌లో కూర్చుని చెంపలని కన్నీళ్ళతో తడుపుకుంటున్న స్నేహితురాల్ని చూసి మరోగంటలో వస్తాను అని చెప్పి పంపానేకానీ నేను వచ్చినా నేనేమీ చేయలేననే విషయం నాకిప్పుడే కాదు, అప్పుడు కూడా తెలుసు ఏదయినా సలహా ఆమెకు ఇవ్వాలంటే నీ భర్తను నువ్వు వదిలెయ్ నేస్తం! నీకు కాస్త మనశ్శాంతయినా దొరుకుతుంది. నీ శరీరం ఈ హింసనుండయినా తప్పించుకుంటుంది." అని ఇవ్వాలి. కానీ ఆమె, ఆమె భర్తకు దూరమయ్యాక నేననుకునే మనశ్శాంతి ఆమెకు దొరుకుతుందా? భర్త వదిలేసిన స్త్రీని అర్థం చేసుకుని సానుభూతి చూపగలిగే స్థితికి ఎదిగిందా యీ సమాజం?

ఆ సలహా ఇవ్వాలనుకున్నప్పుడల్లా నాకు నిట్టూర్పు మాత్రమే మిగిలేది.

అందుకే ఆ విషయం తప్పించి అవీ ఇవీ మాట్లాడి ఆఖరలో—

"బాధపడకు జయా! నీ కొడుకు నీ భర్త ప్రవర్తనచూసి, నీ బాధచూసి మరో తాగుబోతుగా మారకుండా వుంటాడు ఆ రోజు కొరకు ఎదురుచూడు." అని ఆమె బ్రతుక్కి గొప్ప పరిష్కారం చూపి వచ్చేశాను.

"అయితే నీ ఫ్రెండ్ కొడుకు తాగుడుకు బానిస కాడంటావ్?"

ట్రాంక్స్‌బోర్డులో చేస్తోన్న కలవరం అప్పుడే ఎవరికో ట్రంకాల్ ఇచ్చి లైన్‌లో వాచ్ చేస్తూ నా వైపు తిరిగి అంది. ఓ చెవ్వు అటూ వుంచి.

"ఇంకా నీ డ్యూటీ అయిపోలేదూ?" అన్నాను. అప్పుడు ఆరు గంటలు.

"ఆ....అయిపోయింది. కానీ పాపం యీ డబల్ టూ సిక్స్ వన్ సిక్స్ వాళ్ళు తిరుపతి కాల్ అడిగారు, వాళ్ళింట్లో ఎవరో చని పోయారట. ఎన్నిసార్లు ట్రైచేసినా లైన్ దొరకలేదు. ఇప్పుడే దొరి కింది. ఇచ్చేసి వెళ్ళిపోదామని కూర్చున్నాను."

"ఓ.కే. ఇంటికెళుతూ మాట్లాడుకుందాం."

చాలా ఊర్లు తిరిగాక మరలా నెల్లూరుకు నా ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ వచ్చాయి, నెల్లూరంటే నాకు సంతోషమే. నెల్లూరులో జయంతి వుంది. పదేళ్ళల్లో అప్పుడప్పుడు మా మధ్య ఉత్తరాలు, అంటే కలుసుకుందే లేదు. మనసులు విప్పి వ్రాసుకుందీ లేదు.

ఈ పదేళ్ళలో నా తల వెంట్రుకలు చాలవరకు తెల్లబడి పోయాయి. జయకూడా పెద్దదయి పోయుంటుంది. జయ కొడుకు నరేన్ ఏం చేస్తున్నాడో!? నెల్లూరు ఎంత మారుంటుందో!

నిజమే. నేననుకున్నట్టు నెల్లూరు చాలా మారింది. కుసుమ ఇంకా ఆ ఎక్స్చేంజ్‌లోనే వుంది. కాకపోతే ఇప్పుడు ఆమె తల వెంట్రుకలు తెల్లబడ్డాయి. కుసుమ కూతురికి అప్పుడే పెళ్ళయి పోయింది. అప్పుడే ఎవిటీ? తన కూతురు మెడిసన్ చదువుతోంది కాబట్టి ఇంకా పసిపిల్లే అన్పిస్తోంది కానీ, అప్పుడే ఆ పిల్లకు ఇరవైమూడేళ్ళు

అందరి జీవితాల్లోనూ కాలం తెచ్చే మార్పు, మారందల్లా జయ జీవితమే! ఆనాడు భర్త తాగి తందనాలాడితే, ఈరోజు కొడుకు అంతే తేడా!

ఈ వార్త విని నేను చాలా ఆశ్చర్యపోయాను. జయ భర్త చని పోయాడని విని బాధ పడ్డాను. త్రాగి, త్రాగి ఇక త్రాగుడును భరించ లేక లివర్ పాడయి యీ మధ్యనే చనిపోయాడట. ఆరు నెలలుగా మా మధ్య ఉత్తరాలు లేవు.

జయ ఇప్పుడెక్కడుందో! అనుకుంటూనే వాళ్ళింటి కెళ్ళాను. ఆమె అక్కడే వుంది. నలభయ్ రెండేళ్ళ జయ, అరవై ఏళ్ళ దానిలా!

అక్కడే వుండడంలో ఆశ్చర్యమేముంది? నిజానికి పుట్టింట్లో పెరిగింది. పద్దెనిమిదేళ్ళయితే, అత్తవారింటికొచ్చి ఇరవై నాలుగేళ్ళయి పోయింది. భర్త ఎంత హింస పెడితే మాత్రం! అతను పోతే మాత్రం! యీ ఇల్లు పరాయిదెలా అవుతుంది. మా దేశంలో మాకు?

'రా' సంతోషంగా ఆహ్వానించింది జయ.

"నరేన్ ఏడీ?"

"తెలీదు."

కొంత సంభాషణ దొర్లాక మనసులు విప్పి మాట్లాడుకున్నాక అన్నాను.

"ఇంకా పెళ్ళి చేయలేదేం?"

ఆమె శుష్కంగా చూసింది.

ఎందుకు? ఆ పిల్ల జీవితం నా జీవితంలా అయిపోవడానికా?

ఆ ఒక్క వాక్యం చాలు యీ త్రాగుబోతు మగాళ్ళంతా అందిన ఆయుధంతో తల బద్దలు కొట్టుకోవడానికి.

ఇరవైనాలుగేళ్ళ సంసార జీవితం అనుభవించాక, జయ అన్న మాట అది.

"అరుణ కనపడదేం?" అన్నాను. అరుణ జయ పెద్ద తోటి కోడలు. వీళ్ళిద్దరూ కలిసి వుండేవాళ్ళు.

"ప్రక్కవీధిలో వుంటున్నారు. అందరం విడిపోయాం."

అరుణకు నాకు తెలిసి ఒక కొడుకు, ఒక కూతురు. ఆ రోజుల్లో అరుణ కూడా చాలా బాధలే పడింది. ఆమె భర్త వ్యభిచారి, బాధ్యతా రహితుడు. ఊరంతా అప్పులు చేసేవాడు. ఆమె పెద్ద బిడ్డ విమల,

పదమూడేళ్ళ చైతన్య అతని చర్యలను పరోక్షంగా విమర్శించే వాళ్ళే గాని ప్రత్యక్షంగా అతన్ని ఎదిరించలేక పోయేవాళ్ళు.

"చైతన్య ఏం చేస్తున్నాడు? అడిగాను.

"కుదువ బజార్ని, సాని బజార్ని ఏలుతున్నాడు. వుండు నీకు కాఫీ తెస్తాను" అని లేచింది జయ.

నేను మరోసారి షాక్‌లో కెళ్ళిపోయాను. చైతన్య అలా మారాడా? తన తండ్రి బాధ్యతా రాహిత్యాన్ని, అతని ప్రవర్తనను గర్హించే చైతన్య అతనికి వారసుడయ్యాడా? నేనూహించని పరిణామం. ఇది చైతన్యగాని, నరేన్‌గాని తండ్రి ప్రవర్తనపట్ల చిన్నప్పుడు బాధ పడ్డవాళ్ళే, తండ్రుల ప్రవర్తనవల్ల తమ తల్లులెంతగా వేదన పడ్డదీ ప్రత్యక్షంగా చూసినవాళ్ళే. అలాటి వాళ్ళు జీవితంలో పాఠాలు నేర్చుకుని యోగ్యంగా మారతారని నేను అంచనా వేశాను. పైగా కుసుమతో పెద్దగా వాదించాను కూడా.

"ఏవిటాలోచిస్తున్నావ్ తీసుకో" అని తనో కాఫీ కప్పు తీసుకుని నాకో కప్పు అందించింది జయ.

"ఇదెలా జరిగింది?" విస్తుబోతూ అడిగాను.

"ఏది?"

"అదే నరేన్! చైతన్య అలా మారతాడనుకోలేదు"

"ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు?" అని పక్కమీద వాలింది జయ.

"నీరసంగా వుంది. నువ్వూ పడుకో" అని నన్నూ తన పక్కన పడుకోబెట్టుకుంది.

నేను నిశ్శబ్దంగా ఆలోచిస్తున్నాను. నేనా రోజుల్లో చాలా గాఢంగా నమ్మాను, తండ్రి ప్రవర్తనపట్ల విసిగిపోయిన ఈ పిల్లలు బుద్ధిమంతులవుతారని.

జయ భర్తకు ఒక తమ్ముడు కూడా వున్నాడు. అతను వీళ్ళతో కలసి లేడు.

విజయవాడలో ఉద్యోగం చేసుకుంటూ వుండేవాడు. అతను మాత్రం చాలా బుద్ధిమంతుడు, ఎలాంటి చెడ్డ గుణాలు లేవు. అతనెప్పుడయినా ఇక్కడకొచ్చినా అతనితో వీళ్ళు కలవలేక పోయేవాళ్ళు.

అతను త్రాగడని వుట్టి పిసనారి అని అనేవాడు నారాయణరావు.

ఖర్చవుతుందని పరాయి ఆడపిల్లల జోలికి పోడుగానీ వీడు మాత్రం 'ఏకపత్నీవ్రతుడా' అనేవాడు అరుణ భర్త.

సంపాదించినదాంట్లో గుట్టుగా సంసారం చేసుకునేవాడు. తను తన భార్యపిల్లలకు కావల్సిన సర్వసదుపాయాలు చూసేవాడు. అందుకే అతడ్ని అందరూ స్వార్థపరుడు అనేవాళ్ళు. పోనివ్వండి ఆ స్వార్థంలో ఎంత హాయి వుంది.

ప్రతి భర్త ఆ రకం స్వార్థపరుడయితే ఆడదాని కళ్ళల్లో ఇన్ని కన్నీళ్ళెందుకుంటాయి?

"ఇంకా ఆ ఆలోచనేనా?" నవ్వింది జయ.

ఆమె ఒకరకంగా రాయిలా మారిపోయినట్టుంది. మనిషిని రాయిలా మార్చే పరిస్థితులెంత దౌర్భాగ్యమైనవి?

"చైతన్య తండ్రి అప్పులుచేసి ఆ రోజుల్లోనే ఆస్థంతా కాజేసాడు కదా! ఇప్పుడు చైతన్యకు ఎలా జరుగుతోంది?"

"భార్య బాగానే కట్నం తెచ్చింది. అయినా ఎప్పుడూ అప్పులే"

హఠాత్తుగా నాకు వీరేంద్ర గుర్తుకొచ్చాడు. వాడు జయ మూడో తోడుకోడలి కొడుకు.

వాడికిప్పుడు ఇరవయ్ రెండేళ్ళుండవచ్చు.

అడిగాను.

"వీరేంద్రకూడా వీళ్ళలాగే...." అడిగేసి ఒళ్ళంతా చెవులు చేసుకుందామె.

ఆమె జవాబు కొరకు కొంత టెన్షన్‌తో ఎదురుచూస్తున్నాను.

తల అడ్డంగా తిప్పింది జయ.

"వాడిని కన్న తల్లిదండ్రులు నాలాటి దౌర్భాగ్యులు కారు సంధ్యా....వాడు బంగారు కొండ. అప్పుడే యమ్.ఎస్.సి. పూర్తిచేసి ఉద్యోగం చేస్తున్నాడు. అపుడపుడు వచ్చిపోతూ వుంటాడు"

నా టెన్షన్ రిలీవ్ అయింది.

సన్నగా నవ్వుకున్నాను నా తెలివితక్కువ అభిప్రాయానికి.

ఆ రోజుల్లో జయతో అంటూ వుండేదాన్ని నేను.

"మీ ఆఖరి తోడికోడలు కొడుకును కూడా మీ దగ్గరే వుంచుకుని చదివించకూడదా? ఇదో ఈ తాగుబోతువాళ్ళని, తిరుగుబోతువాళ్ళను చూసయినా బుద్ధితెచ్చుకుని పెద్దయ్యాక వాటి జోలికి పోకుండా వుంటాడని"

"వాళ్ళమ్మ ఒప్పుకోదు, పిల్లల్ని తల్లి దగ్గరే వుంచుకోవాలట" అనేది జయ.

"ఏవిటి నీ ఆశ్చర్యం?" అని నీరసంగా నవ్వింది జయ.

నేను ఎందుకు ఆశ్చర్యపోతున్నానో జయకు తెలుసు. అందుకే నేను జవాబివ్వలేదు.

"కుసుమా! నువ్వు గెలిచావు" అన్నాను. ఆ మర్నాడు ఎక్చేంజ్‌లో పని పూర్తిచేసుకుని ఇంటికెళుతూ.

కుసుమకు అర్థంకాలేదు.

పదేళ్ళక్రితం మేమిద్దరం వాదించుకున్న విషయం, కుసుమ ఎప్పుడో మర్చిపోయినట్టుంది.

"మా జయ గుర్తుందికదూ నీకు?"

గుర్తు చేసుకోవటానికి ప్రయత్నిస్తోంది కుసుమ.

నేను గుర్తుచేసాను.

బస్ వచ్చింది!

ఇద్దరం ఎక్కి రాడ్డుపట్టుకుని నిల్చున్నాం.

"ఆమె బావున్నారా?" అడిగింది కుసుమ.

"కథ పునరావృతమయింది."

"అంటే?"

నేను చెప్పబోయాను.

మరలా ఓ మంద మనుషులు బస్ ఎక్కారు-త్రోసులాట.

మా పక్కనున్న సీటులో ఇద్దరు దిగేసారు.

క్షణం ఆలస్యంచేస్తే ఆ సీటు దక్కదన్నట్టుగా గబుక్కున కూర్చుని కుసుమకు జరిగి చోటిచ్చాను.

ఇద్దరం కూర్చున్నాక జయ కుటుంబ కథంతా చెప్పి....

'ఇలా ఎందుకు జరిగిందంటావు? తండ్రిని చూసి కొడుకు బుద్ధి తెచ్చుకోకుండా అదే లైనులో ఎందుకు వెళుతున్నాడంటావు? ఎక్కడుంది లోపం?' అనడిగాను.

నా ఆశ్చర్యానికి కుతూహలాన్ని చంపుకోలేక—

నా గుండెలనిండా ఆవేదన.

పదేశ్నక్రితమే కుసుమ నాతో వాదించింది తాగుబోతు పిల్లలు తాగుబోతులే అవుతారని.

ఆరోజు నేను అంగీకరించలేదుగానీ ఆ విషయం స్పష్టీకరించబడిన ఈరోజు నాకు కుసుమ దగ్గరనుండి జవాబు వినాలనుంది.

"సంధ్యా! చెడు అలవాట్లెప్పుడూ పదిహేడు, పద్దెనిమిది ఏళ్ళ వయసులో అలవడతాయి. ఆ వయసులో వాళ్ళది ఉరకలువేసే రక్తం. అన్నీ చవిచూడాలనే తత్వం. కంటికెదురుగా కనిపించే దానిమీద నిషా, పదిహేను ఏళ్ళకు కొడుకు తల్లినుండి డిటేచ్ అయిపోతాడు.

తల్లి వేదనను అర్ధం చేసుకునే దశనుండి, తను అనుభవించబోయే ఆనంద నిషాలోకి జారిపోతాడు.

ఆ టైములో తండ్రి అతనిని చక్కదిద్దాలి. చక్కదిద్దాల్సిన తండ్రే నిషాకు బానిసయితే, గిల్టీగా, సైలెంట్‌గా వుండిపోతాడు. దానిని అలుసుగా తీసుకుని కొడుకు తనక్కావలసిన దారిలోకెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఎప్పుడో కలదెలుసుకుని, తను పోతున్న మార్గం మంచిది కాదని తెలుసుకున్న అతనిక దానిలోనుండి బయటపడలేడు.

పైగా తను ప్రవర్తించే తీరు మంచిది కాదని తెలిసినా తన అధికృతను నిరూపించుకోను అది మంచిదేనన్నట్టు ప్రవర్తిస్తాడు. నా అనుభవాలవి. అదే తండ్రి నిషాకు బానిస కాకపోతే, తన కొడుకును చెక్ చేసుకోగలడు.

అలాంటి తండ్రి అంటే ఆ కొడుకులో భయం, భక్తి, గౌరవం, తండ్రి అడుగుజాడల్లో నడవాలనే కోరిక అన్నీ ఉంటాయి."

"కుసుమా! వీరేంద్ర విషయంలో అది నిజమే అనుకుందాం. కానీ చైతన్య, నరేన్ వీళ్ళిద్దరూ నేనిక్కడ వర్క్‌చేసే రోజుల్లో తల్లి అంటే ఎంతో సానుభూతిగా వుండేవాళ్ళు. వాళ్ళు ఇలా మారతారనుకోలేదు"

"చెప్పాగా సంధ్యా! ఆ వయసు అలాంటిది. నువ్వే చెప్పావుగా చైతన్య వాళ్ళమ్మను నాన్నయితే ఏమీ అనవు, నేను డబ్బు అడిగితే మాత్రం లేదంటావ్ అనేవాడని. అదే భావం పెరుగుతుంది. వాళ్ళలో

నాన్నను అమ్మ ఎందుకు కోప్పడకూడదు? నన్నెందుకు కోప్పడాలి? అనే భావం వాళ్ళల్లో తయారవుతుంది నేను నాన్నలాటి వాడనే అనే సత్యాన్ని తల్లికి చెప్పాలనే అభిలాషతో తండ్రి వ్యసనాలకు మీరు వారసులవుతుంటారు"

"అందరూ ఇలాగే అవుతారంటావా?"

"అందరూ ఎందుకవుతారు? పర్సెంటేజ్‌ని బట్టి అంటున్నాను ఎక్కువ భాగం వారసత్వాన్ని పంచుకుంటున్నారు" అని నవ్వింది కుసుమ.

బస్ ఆగింది.

లేచింది కుసుమ. నేనూ లేచాను. ఇద్దరం బస్ దిగాం. ప్రక్క ప్రక్క నడుస్తున్నాం.నేను ఆలోచిస్తున్నాను. ఈ పదేళ్ళుగా నాకు తెలిసిన ఫామిలీస్‌ను గుర్తుతెచ్చు కుంటున్నాను.

నిజమే కుసుమ థీయరీలోవా స్తవముంది. చాలామందిచెడిపోయిన పిల్లలు తండ్రులు వ్యసనపరులే.

ఇది చర్విత చరణం అవుతున్నప్పుడు ఎందుకు బాధపడరు వీళ్ళు. తమ బిడ్డల్ని బంగారు కొండలుగా చూసుకోవడానికైనా నిషా నుండి ఎందుకు బయటపడరు వాళ్ళు?

"ఏయ్ మీ వీధి వచ్చేసింది. మా ఇంటి కొస్తావా ఏం?" గుర్తు చేసింది కుసుమ.

నవ్వి కుసుమకు వీడ్కోలుచెప్పి మా వీథిలోకి నా ప్రయాణాన్ని మలుపు తిప్పాను.

*